# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# అమ్మా..చూడాలి..!!

"ఏం చేస్తున్నారు ఇద్దరు మేరీలు?" అంటూ నవ్వుతూ ఇంట్లోకి వచ్చాడు జోయీ.

ఆ మాటకి అతని ముగ్గురు అక్కలు ఎప్పటిలాగే నవ్వారు. అందరికంటే చిన్నావిడ బ్లెసికా ఎప్పటిలాగే చెయ్యెత్తి కొడతానన్నట్టు అభినయించింది. అతని ముగ్గురు అక్కల్లో ఇద్దరు పెళ్ళి చేసుకోలేదు,అందుకే అలా సరదాగా అంటూ ఉంటాడు అతను.

అతను కూడా నవ్వుతూ తను తెచ్చిన పళ్ళు, పెరుగు పెద్ద అక్క చేతికిచ్చి ముఖం కడుక్కోవడానికి తన గదికి వైపు నడిచాడు.

అతను బట్టలు మార్చుకుని వచ్చేసరికి అందరికంటే పెద్దావిడ 71 సంవత్సరాల జాస్మిన్ అందరికీ టేబిల్ మీద భోజనాలు ఏర్పాటు చేసింది..

" అమ్మ తిందా?" అడిగాడు జోయీ హాల్ లో మంచం మీద ప్రశాంతంగా నిద్రపోతున్న తొంభై నాలుగేళ్ళ తల్లి వైపు చూస్తూ..

" తిందిగా, రెండు యాపిల్స్, ఒక అరటిపండు మూడు కప్పుల పెరుగు వేసి స్మూతీ చేసి నేనే ఇచ్చాను" అంది అతని రెండో అక్క రొస్మీ..

"ష్! వాడు అడిగింది తిందా? అని. ఏమి తింది? ఎంత తిండి అని లెక్కలెందుకు? మన దిష్టే తగులుతుంది" అంది జాస్మిన్ చిరుకోపంతో చెల్లెల్ని వారిస్తూ

" గుడ్" అన్నాడు జోయీ..

ఆ తర్వాత అతనూ, నలుగురు అక్కలూ కూర్చుని నెమ్మదిగా భోజనం మొదలుపెట్టారు. అక్కడే పడుకున్న తల్లికి మెలకువ రాకుండా జాగ్రత్త పడుతూ, నెమ్మదిగా కబుర్లు చెప్పుంటూ నిదానంగా తింటారు వాళ్ళు.

జోయీ డ్రైవింగ్ స్కూల్లో శిక్షకుడిగా పనిచేస్తాడు వారానికి నాలుగురోజులు, మిగతా రెండు రోజులూ హోటల్లో పార్ట్ టైం గా చేస్తాడు. వారానికి ఒకరోజు పూర్తిగా శలవు. అతని పెద్ద అక్క దగ్గరలోని హోటెల్ లో పాతికేళ్ళు పని చేసి ఈ మధ్యనే మానేసింది.

"అమ్మ ఎలా ఉంది ఈ రోజు? నర్స్ మాట విందా? ఏమీ గొడవ చెయ్యలేదుగా?" జోయీ అడిగాడు పెద్దక్కని. ఆవిడే ఇప్పుడు అమ్మతో పాటుగా ఉండేది..

"హ్మ్! "అంటూ నిట్టూర్చింది ఆవిడ.

" ప్రతీ రోజూ ఉండేదే!! వాడొక్కడూ లేడు నా దగ్గర" అని ఏడుస్తుంది.

" మొన్నటివరకూ పిన్ని ని గుర్తు పట్టలేదుగా, నిన్నటినించీ అన్నీ మళ్ళీ గుర్తుకు వచ్చాయి, చిన్నప్పటి కబుర్లన్నీ చెప్పింది చెల్లెలితో, చాలా విచిత్రంగా. మీ ముగ్గురితో చెప్పడమే మర్చిపోయాను. నిన్న విడియో కాల్ చేసి మాట్లాడాము. తమ్ముడినీ, వాడి కొడుకునీ అందరినీ పేరు పేరునా పలకరించింది. మహాలియాతో మాత్రం ఎప్పటిలాగే ముభావం, అది మాత్రం మర్చిపోదు అమ్మ మెదడు" అంటూ నవ్వింది జాస్మిన్..

" వాడిని అమెరికా రానివ్వకుండా వదినే చేసిందని అమ్మ నమ్మకం, అందుకే ఆవిడంటే కోపం. అదింక ఈ జన్మకి మారదు" అన్నాడు జోయీ భారంగా.

అక్కలు ముగ్గురూ తల ఊపారు.

"ఆ మాట నిజమే కదా! ఎందుకో అమ్మకి కోడళ్ళు అచ్చిరాలేదేమో. మహాలియా కి ఎందుకో అమ్మంటే మొదటినించీ పడేది కాదు, నీ భార్యతో బానే ఉండేది కానీ మీరిద్దరూ అనుకోకుండా విడిపోయారు " అంది బెసికా దిగులుగా.

" ఇప్పుడవన్నీ ఎందుకు?" అంది రోస్మీ ఆమెని మందలిస్తున్నట్టుగా

" నా విషయం సరే, అన్న విషయానికొస్తే నిర్ణయం వాడొక్కడే తీసుకోలేడుకదా, వదిన కూడా వాడి జీవితంలో భాగం కదా, మనకున్నట్టే వదినకీ ఉంటుంది కదా! తన అమ్మ, నాన్నలమీద ప్రేమ" అంది రోస్మీ.

ఫిలిప్పీన్స్ రాజధానిమనీలాకి కాస్త దూరాన ఉన్న ఒక ఊరు వాళ్ళది.

ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు గల సామాన్య రైతు కుటుంబం. ఆ ఇంటి పెద్ద ఆల్బెర్టో చాలా మంచివాడు, నెమ్మదస్తుడు. కష్టపడి వ్యవసాయం చేసుకుని తన భార్యా, పిల్లలని పోషించుకునేవాడు. కుటుంబ సంబంధాల పట్ల అమితమైన గౌరవం, అతిథి మర్యాదలకూ, నమ్మకంగా పనిచెయ్యడానికీ పేరెన్నిక గన్న తన సాటి దేశస్థుల్లాగే అతను కూడా ఉండేవాడు.

భార్య బెనిల్డా అతనికి విరుద్ధం. దుడుకుమనిషి, కాస్త తొందరపాటు, మాట దురుసు ఎక్కువే. మనసు మాత్రం మచిదే, ఎంతమంది వచ్చినా వండి పెట్టడానికి అస్సలు బద్ధకించేది కాదు.. ఎక్కడో ఆమెకు ఆ పల్లె జీవితం పైన అసంతృప్తి ఉండేది. భర్త ఒప్పుకుంటే ఎక్కడైనా పట్నానికి వెళ్ళి మరికొంత దర్జాగా బ్రతకాలని, బ్రతగ్గలమని ఆమెకి ఎంతగానో ఉండేది.

ఆల్బెర్టో మాత్రం “పిచ్చిదానా! ఎక్కడున్నా ఇదే వంట, ఇదే తిండి, ఇదే పని, దీనికోసం ఎక్కడో మనది కాని భూమికి వెళ్ళడమంత అవివేకం లేదు నా దృష్టిలో, మనకు నాలుగు కార్లు లేకపోవచ్చు, నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళ్ళడానికేమీ సమస్య లేదు, నలుగురు పిల్లలతో హాయిగా ఉన్నామిక్కడ. ఏం తక్కువైంది చెప్పు?" అనేవాడు.

" నలుగురు కాదు, ఐదుగురు, మన పిల్లలు" అనేది కోపంలో కూడా.

ఆమె చేత అలా అనిపించాలనే అతనా మాట అనేవాడు.. ఏ క్షణాన అన్నాడో అతని మాట త్వరలోనే నిజమై కూర్చుంది. ముట్టుకుంటే కందిపోయేంత మల్లెమొగ్గలా ఉండే వారి పెద్దకూతురు జాస్మిన్ ను తప్ప మరొకరిని చేసుకోనని పట్టుపట్టిన  స్నేహితుడి కొడుకు కార్లో కోరిక కాదనలేక పోయాడు.

కార్లోకి పెద్ద చదువు లేకపోయినా ఎలాగో స్నేహితుల సహాయంతో అమెరికా కి వెళ్ళగలిగాడు. అక్కడే ఏదో ఉద్యోగం చేసుకునేవాడు. తల్లి లేని అతను తండ్రిని తనతో తీసుకెళ్ళి పోయాడు. చాలా మంచి వాడు, కాదనడానికేమీ లేకపోవడం వల్లనూ జాస్మిన్ కూడా కార్లో ని ఇష్టపడ్డం వల్లనూ వెంటనే వారి పెళ్ళి జరిగింది. అలా భర్తతో పాటు జాస్మిన్ అమెరికా ప్రవేశించింది.

ఆ తర్వాత సంవత్సరమే జోయీ అన్న బెంజీ తన స్నేహితురాలు మహాలియాని పెళ్ళి చేసుకుంటానన్నాడు. అతని కోరికనెవ్వరూ కాదనలేదు. మహాలియాకి, అత్తగారికీ పడేది కాదు మొదట్నించీ. ప్రతీ చిన్న విషయానికి ఎవరో ఒకరు గొడవ లేవదీస్తే రెండో వారు దాన్ని మరింత సాగదీసేవారు. కుటుంబానికి ఎంతో ప్రాముఖ్యత నిచ్చే ఆల్బెర్టో కొడుకులిద్దరూ తన దగ్గరే ఉండాలని ఆశ పడ్డాడు. మహాలియాకి, ఆమె తల్లి తండ్రులకి అది అంతగా రుచించలేదు. అక్కడే మొదలయింది ఆమె కోపం, దానికి తోడు అత్తతో గొడవలు. ఆ గొడవలు జాస్మిన్ తన తల్లి తండ్రులని అమెరికా తీసుకు వెళ్ళాలన్న నిర్ణయాన్ని అమలుపరిచేవరకూ కొనసాగుతూనే ఉన్నాయి.

జాస్మిన్, కార్లో తమకి గ్రీన్ కార్డ్, పౌరసత్వం వచ్చాకా తన తల్లి తండ్రులని మొదట ఆమె అమెరికా గ్రీన్ కార్డ్ మీద తీసుకు వచ్చింది. ఆపైన ఒక్కొక్కరుగా తన చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ కూడా తీసుకురావడనికి ప్రయత్నిస్తూ ఉండగా ఆమె పెద్ద తమ్ముడు సుముఖత చూపించలేదు.

అతను అవుననీ, కాదనీ నానుస్తూ ఉంటే వివరం చెప్పమని అడిగినప్పుడు అతని భార్య అతని తరపున చెప్పింది..

“ వదినా, మాకు ఇక్కడ మన ఊరినీ, మన నేలనీ, ముఖ్యంగా మనవాళ్ళనీ వదిలేది అక్కడెక్కడికో రావడం ఇష్టం లేదు. మీరు మరోలా అనుకోకండి,వస్తానన్న వారిని హాయిగా తీసుకువెళ్ళండి" అంది..

ఆమాటలకి, ఆమె చెప్పిన తీరుకి నొచ్చుకున్న జాస్మిన్  అదే నా తమ్ముడి మాట కూడానా? అయితే ఒకసారి వాడు చెప్తే బావుంటుంది" అంది..

"ఎవరు చెప్పినా అదే మాట వదినా? మీరు మీ అమ్మా నాన్నలతో కలిసి ఉండాలని అందరినీ తీసుకువెళ్తున్నారు. జోయీ, అతని భార్య విడిపోయారు కనక అతనికేమీ ఇబ్బంది లేదు. కానీ నేను మా అమ్మా నాన్నలని వదిలి ఉండాలని అనుకోవడం లేదు. అమెరికా వస్తే నేను ఎప్పుడు కావాలంటే అప్పుడు మా వాళ్ళని చూడలేను. అందుకే బాగా ఆలోచించి ఈ నిర్ణయం  తీసుకున్నాం" అంది చివరి మాటలు ఒత్తి పలుకుతూ..

ఇవన్నీ వింటూ కూడా తన పెద్ద తమ్ముడేమీ మాట్లాడకపోయేసరికి అతని అభిప్రాయమూ అదేనని ఆవిడకి అర్ధమైంది. అందుకని ఎక్కువగా రెట్టించకుండా మిగిలినవారిని తీసుకు వచ్చేసింది. తాము నలుగురూ ఇక్కడుండి అతనొక్కడూ అక్కడుండి పోయాడని వాళ్ళెప్పుడూ అనుకుని బాధ పడుతూ ఉండేవారు. కనీసం అతని కొడుకులిద్దరినైనా ఇక్కడికి వస్తే బావుండునని అనుకునేవారు కానీ వాళ్ళతో చెప్పే సాహసం చెయ్యలేకపోయారు. ఫోన్ లో మాట్లాడడం, వీలున్నప్పుడు వీళ్ళు వెళ్ళి చూసి రావడం చేసేవారు.

అవన్నీ మళ్ళీ గుర్తు చేసుకుంటూ భోజనం ముగించారు..

" అమ్మకి అన్నయ్య మీద దిగులు రోజు రోజుకీ ఎక్కువౌవుతోంది. ఒక్కసారి వాడిని చూడాలని ఉంది ఆవిడకి" ప్లేట్లు కడుగుతూ  అంది రోస్మీ..

" నిజమే, వాడేమో రాడు, ఈవిడని కదిలించే పరిస్థితి లేదు. ఎలా?" అంది జాస్మీన్.

" అప్పుడప్పుడు వదినని చూస్తే నాకు కోపం, ఇలాంటప్పుడైనా పట్టూ, విడుపూ ఉండద్దా?" అంది బెసికా..

" ఆవిడననడం ఎందుకు? అన్నకి రావాలని అనిపిస్తే ఇన్నేళ్ళల్లోనూ ఒక్కసారైనా చెప్పలేదా? మీరు వస్తు న్నా రు కదా చాలు, మాకంత డబ్బు లేదు.. ఇలాంటి మాటలెం దుకు?? ఇప్పుడు ఆవిడ పట్టూ, విడుపూ సమస్య కాదు. అసలు వాడు వస్తానన్నా వీసా దొరుకుతుందో లేదో, అరవై ఐదున్నాయి వాడికి" అన్నాడు జోయీ..

అందరూ భారంగా తలలూపారు 'నిజమే' అన్నట్టు.

మర్నాడు సాయంత్రం ఐదు గంటలకు జోయీ శిక్షణ పూర్తి కావస్తుండగా ఫోన్ మోగింది. అన్నయ్య నంబర్ చూసి ఆగలేక ఫోన్ ఎత్తాడు. నేర్చుకుంటున్న అతనితో మరో నిమిషానికి కార్ పార్క్ చేయించి, డబ్బు తీసుకుని పంపేశాకా మాట్లాడాడు..

" అమ్మ ఎలా ఉంది?" అడిగాడు అన్న బెంజీ..

" బాగానే ఉంది అన్నయ్యా! " జోయీ చెప్పాడు..

" నాకు తెలుసు నాకోసమే బాధ పడుతోంది, మీరందరూ అక్కడ ఉండి నేనొక్కడినే ఇక్కడ ఉండడం నాకెప్పుడూ ఇష్టం లేదు. కానీ మహాలియా మీద ప్రేమతో, తనను వదిలి వెళ్తే ప్రాణ త్యాగం చేస్తానని ఆమె బెదిరించడంతో ఏమీ మాట్లాడలేకపోయాను.

మనందరినీ తనవారిగా భావించి ఇంటికి పెద్ద కొడుకులా నిలిచిన కార్లో బావ హఠాత్తుగా మరణిస్తే చూడడానికి కూడా రాలేదు నేను.

ఇల్లు గడవడం కష్టమైన స్తితిలో జాస్మీన్ మొదటిసారి హోటల్లో చేరి మిమ్మల్నందరినీ పోషించింది. అక్కకి తోడుగా మీరిద్దరు చేరారు. మనకున్న చదువులకి దొరికే పనులేవో చేసి మీరందరూ అమ్మా, నాన్నలని ఎంతో బాగా చూసుకున్నారు.

నాన్నకి పక్షవాతం వచ్చి మంచాన పడితే ఆయన్ను కనిపెట్టుకుని ఉండడానికే పెళ్ళి మానుకుంది రోస్మీ.

అక్క ఒక్కర్తీ పెద్దదయిపోతోంది, తానూ తోడుగా పని చేస్తానని బెసికా కూడా ఒక్కో పుల్లా చేర్చి గూడుని నిలిపారు. అసలు వదినలిద్దరినీ చూసి భయపడి బెసికా పెళ్ళి మానుకుందేమో అని నా అనుమానం...

నువ్వు అంది వచ్చి రెండు ఉద్యోగాలు చేస్తూ చూసుకునేవరకూ అక్క కూడా ఉద్యోగం మానలేదు.

ఈ మధ్యలో నేనేం చేశాను మనకుటుంబానికి? హాయిగా ఇక్కడ మనకున్న పొలాన్ని అనుభవిస్తున్నాను ఇన్నేళ్ళుగా.

అస లిదే మాహాలియా కోరికేమో? వంతులు లేని సంపద, పొత్తులు లేని సంసారం.

ఏవిటో ఆమెనని ఏం ప్రయోజనం? నా బుద్ధి ఏమయింది?

ఎందుకు చెప్పలేకపోయాను నాకు కావలసినదేమిటో?

కొన్ని విషయాలెంత గొప్పవో, ఏం పోగొట్టుకున్నామో అప్పుడు తెలీదేమో!

నేను ఇప్పుడు మీ దగ్గరకి వస్తాను. మహాలియా వచ్చినా, రాకపోయినా సరే! అమ్మ దగ్గరకి వస్తాను! ఆమెకి మిగిలిన కాలాన్ని తనతో గడపడానికి వస్తాను. నీకు తెలుసా జోయీ! అంత పెద్ద వయసులో కూడా అమ్మ నా చిన్నప్పటి సంగతులు చెప్తూ ఉంటే నాకెంత దు:ఖం వచ్చిందో!

గత రెండు నెలలుగా అన్నీ మర్చిపోయింది కదా! నిన్న ఎందుకో హఠాత్తుగా అన్నీ గుర్తొచ్చినట్టు ఎన్ని కబుర్లు చెప్పింది అనుకున్నావు?

గొంతు జీరతో వణుకుతున్నా, పొడి బారి దగ్గు వచ్చినా సరే పది నిమిషాల సేపు మాట్లాడుతూనే ఉంది.

బాగా దగ్గొస్తోందమ్మా! కొద్దిగా ఆగి మాట్లాడు అని చెప్పబోతున్న రోస్మీ చేతిని తోసేసి మరీ, నా చిన్నప్పటివి, మన చిన్నప్పటివి ఎన్ని కబుర్లో, ఎన్ని మురిపాలో! ఇప్పటికీ మనం అదే వయసులో ఉన్నట్టు..

ఐ పాడ్ ఆపేస్తే నేను మాయమైతానన్న దిగులు ఆమె కళ్ళల్లో కనిపించాకా నన్ను నేను నిలవరించుకోలేకపోతున్నాను..

నాకు వీసా కావాలి మై బ్రదర్.. నువ్వే ఎలాగైనా నాకీ సహాయం చెయ్యాలి. చేస్తావు కదూ.. ప్లీజ్. అమ్మను నేను చూడాలి, చూసేలా నువ్వే చెయ్యాలి.. ఐ వాంట్ వీసా, ఐ వాంట్ టు కమ్ దేర్!"

అంటూ భోరుమంటున్న అన్నని ఏమని సముదాయించాలో తెలీనట్టు కూర్చుండి పోయాడు జోయీ..

●●●

Click here to share your comments on this story